క్లుప్తంగా

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



పెనుగంచిప్రోలు: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు ఎన్నడూ లేని విధంగా అధిక ప్రాధాన్యతనిస్తున్నారని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ తల్లి కడుపులో ఉన్న దగ్గరుండి పుట్టి, పెరిగి, ఉన్నత స్థితికి వెళ్లేవరకు వారి ఆలనా, పాలనా జగనన్న ప్రభుత్వమే చూస్తోందన్నారు. కార్పొరేట్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

వైభవంగా గురు విశ్వ స్ఫూర్తి జయంతి



పెనుగంచిప్రోలు: సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి 83వ జయంతి వేడుకలు సోమవారం స్థానిక స్ఫూర్తిధామం వద్ద వైభవంగా నిర్వహించారు. ఆంధ్రా, తెలంగాణకు చెందిన వక్తలు పైడిపాటి ఉమానాథశర్మ, వేముల వెంకటేశ్వర్లు, ఎం. గంగాభవాని, డాక్టర్. రామారావు మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి ప్రవచించిన ధ్యాన, మనోప్రస్థాన సిద్ధాంతం ద్వారా మనిషిలో నిద్రాణమైన మానవత్వాన్ని మేల్కొలపాలన్నారు. మానవత్వమే మతంగా రూపాంతరం చెందాలనేదే ఆయన ఆకాంక్ష అన్నారు. గురుదేవులు అందించిన ఆసన, ప్రాణాయామ, ధ్యాన్య విధానం ద్వారా మనిషిని అత్యున్నత స్థితికి ప్రస్తావించవచ్చని విశ్వస్ఫూర్తి చూపించారన్నారు. అనంతరం విశ్వ మానవతా స్ఫూర్తి చైతన్య యాత్రను గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



కంచికచర్ల : వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని, అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. ఆటోలో మహిళలు ఎక్కినప్పుడు గౌరవంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ, పోలీస్‌సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



జగ్గయ్యపేట అర్బన్: అద్దె ఇళ్లలో ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్న అక్క చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షల విలువైన స్థిరాస్తిని ఉచితంగా అందజేస్తుండటం ద్వారా వారి సొంతింటి కలను సాకారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం స్థానిక బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీలో ధనంబోడుకు చెందిన దారెల్లి మహేష్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను పుణ్యమా అని మాకు సొంతింటి కల ఇంత త్వరగా నెరవేరడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రవికుమార్, మాజీ జెడ్పీటీసీ చల్లా వైకుంఠరావు, ఎన్ఎస్‌పీ సైదా, చిల్లకల్లు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు ఎస్ఐగా మహాలక్ష్మణుడు

వీరులపాడు: వీరులపాడు ఎస్ఐగా మహాలక్ష్మణుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న సోమేశ్వరరావు నందిగామ–1 ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మహాలక్ష్మణుడు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ముండ్లపాడులో మొక్కజొన్న రాశులను కాపాడుకొనేందుకు పరదాలు కప్పుతున్న రైతులు



జుజ్జూరులో నేలకొరిగిన మొక్కజొన్న



పెనుగంచిప్రోలులో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట చుట్టూ చేరిన నీటిని చూపుతున్న రైతు



అకాల వర్షం.. కల్లాల్లో కష్టం

అకాల వర్షం రైతులకు తీరని వేదనను మిగిల్చింది. ద్రోణి ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్నను కాపాడుకోవటానికి పరదా పట్టాలతో పొలాలకు పరుగులు తీశారు. వర్షం భారీగా కురవటంతో పట్టాలు కప్పినా వర్షపు నీరు కిందకు చేరి మిర్చి, మొక్కజొన్న తడిసింది. వర్షానికి కోతకు వచ్చిన వరి నేలకు ఒరగడంతో పాటు అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు వద్ద కోత కోసి బస్తాల్లో పట్టిన ధాన్యపు సంచులు నీటిలో తడిశాయి. అలాగే వీరులపాడులో మొక్కజొన్న నేలవారింది. రైతులు వాటిని ఒడ్డుకు చేర్చుకునేందుకు నానా పాట్లు పడ్డారు. కోతలకు సిద్ధంగా ఉన్న వరి కంకులు నీటిలో తడవటంతో గింజ రాలటంతో పాటు మొలకలు వస్తాయని రైతులు అంటున్నారు.

– పెనుగంచిప్రోలు/వీరులపాడు

అసంఘటిత రంగాలకు ప్రభుత్వ అండ

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని సామినేని విశ్వనాథం కార్మిక నగర్‌లో మే డే సందర్భంగా వివిధ కార్మిక సంఘాల భవనాల వద్ద ఏర్పాటుచేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఉదయభాను పాల్గొన్నారు. ముందుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికుల సౌకర్యార్థం ఇప్పటికే రెండు ఉచిత అంబులెన్స్ వాహనాలను ఏర్పాటుచేసిన అగ్రహారం డ్రిల్లింగ్ ఖాజా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కార్పెంటర్స్ సంఘ కార్యాలయం, పెయింటర్స్ సంఘ కార్యాలయాలకు రూ. 50 వేల చొప్పున రూ 1 లక్ష అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, మాజీ జెడ్పీటీసీ చల్లా వైకుంఠరావు పాల్గొన్నారు.

- జగ్గయ్యపేట: చిల్లకల్లు గ్రామంలో మేడే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బిల్డింగ్ వర్కర్స్ యనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పతాకాన్ని ఏఎంసీ చర్మన్ ముత్తినేని విజయశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధు, యాదగిరి, ఏడుకొండలు, ఈశ్వరరావు పాల్గొన్నారు.
- వత్సవాయి: మేడే వేడుకలను మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సీఐటియూ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం వత్సవాయిలోని సీపీఎం పార్టీ కార్యాలయం ముందు పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు ఆవిష్కరించారు. అలాగే పోలంపల్లి, మంగొల్లు, కన్నెవీడు, కంభంపాడు, గ్రామాలలో నాయకులు జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి టి. రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి బి. రాము పాల్గొన్నారు.



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను

కార్మికులు సంతోషంగా ఉండాలి..

పెనుగంచిప్రోలు: మేడే సందర్భంగా సోమవారం స్థానిక తుఫాన్ కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రవికుమార్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సముద్రాల వెంకటరావు పాల్గొన్నారు. అలాగే కొణకంచి క్రాస్‌రోడ్స్ వద్ద ఆటో యూనియన్ వర్కర్స్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.

- నందిగామ: కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సబ్ జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వి. లక్ష్మీరాజ్యం కార్మికులకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల జరిగిన మే డే వేడుకలలో భాగంగా సీఐటీయూ కార్యదర్శి కటారపు గోపాల్ జెండాను ఆవిష్కరించారు.
- జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. స్థానిక సుందరయ్య భవన్ వద్ద, డీవీఆర్ నగర్ ఆర్చ్ వద్ద, ఆర్టీసీ డిపో వద్ద జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు సంయుక్త ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామనాథం, ప్రణయ్‌తేజ, కె.శ్రీనివాసరావు, ఫణిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పేరులోనే శ్రామికులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరులోనే శ్రామికులున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులకు బాసటగా నిలుస్తూ కార్మిక పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మంచాల చంద్రశేఖర్, నాయకులు పాములపాటి రమేష్, వైఎస్ఎన్ ప్రసాద్, కరి రవీంద్ర, బండారు వెంకట్రావ్, దాసు, పారుపల్లి హరిబాబు, నాదెండ్ల నరేంద్ర పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

- పట్టణంలోని పలు చోట్ల ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలైన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, కార్పెంటర్, సెంట్రింగ్, పెయింటింగ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆర్టీసీ, ఆయా సంఘాల నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ట్రాలీ ఆటోవర్కర్స్ యూనియన్ వద్ద ఎస్‌వి రామారావు జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు జూనెబోయిన శ్రీనివాసరావు, పోతిపాక వెంకటేశ్వర్లు, అంబోజి శివాజీ, షేక్ అసదుల్లా తదితరులు పాల్గొన్నారు.
- కంచికచర్ల : కంచికచర్లలో సోమవారం మేడే సందర్భంగా సీఐటీయూ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ రంగ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు జీ హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్మికులకు పనిగంటలు తగ్గించాలన్నారు. నాయకులు సయ్యద్ ఖాసీం, ఎల్. మల్లేశ్వరరావు, కాశిబోయిన రాంబాబు, భూషణం పాల్గొన్నారు. అలాగే స్థానిక రాజ్యలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ వద్ద కార్మికులు మేడే వేడుకలు ఆదివారం జరుపుకున్నారు. ముందుగా జెండాను ఎగురవేసి మేడే విశిష్టత గురించి వివరించారు. అదేవిధంగా మండలంలోని పరిటాల, కీసర, గండేపల్లి, చెవిటికల్లు, కొత్తపేట, మొగులూరుల్లో కార్మిక సంఘ నాయకులు మేడే వేడుకలు జరుపుకున్నారు.
- వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలో సీఐటీయూ జిల్లా నాయకుడు కోట కల్యాణ్ కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాట్ల రవి, లాల్ అహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



మేడే వేడుకల్లో మాట్లాడుతున్న రవికుమార్



మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం



జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



చిల్లకల్లులో జెండా ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్

ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో 17 గ్రామ పంచాయతీలలో పింఛన్‌ల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. ఒకటో తేదీ కావటంతో తెల్లవారుజాము నుంచే వలంటీర్‌లు, గృహ సారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేశారు. ముక్త్యాలలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు షాఉద్దీన్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు వలంటీర్‌లు, గృహ సారథులతో కలిసి పింఛన్‌లు అందజేశారు. 85 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో జయచంద్ర తెలిపారు.

పెనుగంచిప్రోలులో 81 శాతం పింఛన్ల పంపిణీ..

పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ ఈనెల మొదటి రోజు సోమవారం సాయంత్రానికి 81 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.



ముక్త్యాలలో పింఛన్‌లు అందజేస్తున్న వలంటీర్

ఐదు అర్జీలు స్వీకరణ

నందిగామ: తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని నందిగామ మండలం కొండూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు స్పందనలో ఆర్డీవోకు విన్నవించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. స్పందన ద్వారా కొండూరు గ్రామానికి చెందిన రైతులు ఎంటీయూ 1153 ధాన్యాన్ని గతేడాది కొనుగోలు చేశారని ఈ ఏడాది కొనుగోలు చేయకపోవడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను రైతులకు ఆర్డీఓకు వివరించారు. మొత్తం స్పందనలో ఐదు ఫిర్యాదులు అందగా వాటిలో రెవెన్యూకు సంబంధించి 3, సర్వేకు సంబంధించి 1, ధాన్యం కొనుగోలుకు సంబంధించి మరొకటి అందాయని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారం

వీరులపాడు: స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆర్డీఓతో మాట్లాడుతున్న రైతులు

స్పందనలో మూడు అర్జీలు

కంచికచర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ శంకరబాబు సోమవారం తెలిపారు. కంచికచర్ల గ్రామంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని ఒకటి, పట్టాదార్ పాసు పుస్తకాలు కోసం రెండు అర్జీలు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. బాలశంకరరావు, ఏపీఓ కోట భాస్కరరావు, ఏఓ కె. విజయకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు బదిలీ

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం జగ్గయ్యపేట సీఐ ఎ.నాగమురళి స్పెషల్ బ్రాంచ్‌కు, విజయవాడ సిటీ సీఐ ఎం.జానకిరామ్ జగ్గయ్యపేటకు బదిలీ అయ్యారు.

నందిగామ ప్రాంతంలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. నందిగామలో 42.4 మిల్లీమీటర్లు, కంచికచర్లలో 42.8, చందర్లపాడులో 25.6, వీరులపాడులో అత్యధికంగా 90.3 మిల్లీమీటర్లు, జగ్గయ్యపేటలో 22.2, వత్సవాయిలో 56.8, పెనుగంచిప్రోలులో 46.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తం మీద డివిజన్‌లో 336.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోండి

జగ్గయ్యపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవోఎంఎస్ నంబర్ 7 ప్రకారం పింఛన్‌దారులు ఈ నెల 10లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సబ్ ట్రెజరర్ ప్రఫుల్లకుమార్ సోమవారం తెలిపారు. పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పెన్షనర్‌లు తమ సీఎఫ్ఎంఎస్ ఐడీ, ఆధార్ కార్డుకు లింకైన మొబైల్ నంబర్‌తో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

ఏసీపీగా జనార్దన నాయుడు బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఏసీపీ, బదిలీపై వెళ్తున్న ఏసీపీలు



సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ జనార్దన

నందిగామ: డివిజన్ నూతన ఏసీపీగా కె. జనార్దన నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి. నాగేశ్వరరెడ్డి కాశీబుగ్గ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న జనార్దన నాయుడును ప్రభుత్వం నందిగామ ఏసీపీగా నియమించింది. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆయన వెంట బదిలీ అయిన ఏసీపీ నాగేశ్వరరెడ్డి ఉన్నారు.

సీపీని కలిసిన ఏసీపీ

నందిగామ: నందిగామ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కె. జనార్దన నాయుడు ఎన్టీఆర్ జిల్లా సీపీ టి.కె. రాణాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయండి

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులకు విత్తనాల పరంగా గానీ, ఎరువుల పరంగా గానీ ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో పేట నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే ఉదయభాను సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకుంటూ వారికి అత్యంత ప్రాధాన్యం నివ్వాలన్నారు. రైతులకు పత్తి, మిరప, నాణ్యమైన విత్తనాలను అందించాలని ఆదేశించారు. రైతులంతా తమ గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో ఈనెల 3వ తేదీ లోగా వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్, ఎంపీపీలు చెంబేటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, జెడ్పీటీసీలు ఊట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, మండల వ్యవసాయశాఖ సలహాదారులు పరిటాల వెంకటేశ్వర్లు, చెంచు బెనర్జీ, సామినేని లక్ష్మీనారాయణ, దేవినేని రామారావు పాల్గొన్నారు.